క్లుప్తంగా

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం

- సైకిల్‌పై విధులకు హాజరైన జీవీఎంసీ కమిషనర్



బంగ్లా నుంచి ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా.. పర్యావరణ పరిరక్షణ దిశగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. విధులు అనంతరం నడక మార్గాన ప్రధాన కార్యాలయం నుంచి బంగ్లాకు చేరుకున్నారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారంలో ఒక రోజు నగర ప్రజలు తమ సొంత వాహనాలు విడిచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఏయూ అభివృద్ధి



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య కె.సమత

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వర్సిటీ అధికారులు, డీన్‌లతో ఆమె మాట్లాడారు. విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, ప్రతి కుటుంబం నుంచి ఉన్నత విద్యావంతులు రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. దీనిని సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయంలో పటిష్ట బోధన వ్యవస్థతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన బంగ్లాదేశ్ దౌత్య అధికారి ఏయూలో పటిష్ట బోధన వ్యవస్థను చూసి ప్రశంసించారని ఆమె చెప్పారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం అభివృద్ధికి దోహదపడే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియలో అందరి సహకారం, సూచనలు స్వీకరించి సమష్టిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతికి బాటలు వేస్తామని ఆమె చెప్పారు.

మై భారత్ వికసిత్ 2047 పోటీలకు విశేష స్పందన



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హర్షిత

బీచ్ రోడ్డు: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్స్‌లో నిర్వహించిన మై భారత్ వికసిత్ 2047 జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా అధికారి మహేశ్వర తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు అందజేస్తామన్నారు. జిల్లా నుంచి హర్షిత దేవగుప్తపు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు.

సీఐ రామారావు బదిలీ

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ కోరాడ రామారావు విజయనగరం టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు విశాఖ రేంజ్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గత నాలుగేళ్లుగా మూడో పట్టణంలో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామారావును సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నా నేపథ్యంలో విజయనగరం బదిలీ చేసినట్లు తెలిసింది.

అవ్వాతాతల సంక్షేమమే లక్ష్యం



17వ వార్డులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు



13వ వార్డు శ్రీకృష్ణాపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- సామాజిక పింఛన్ పెంపుపై సర్వత్రా హర్షం
- సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఈ నెల కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఇటీవల వార్డులో అర్హులైన వృద్ధులు, వితంతువులు 36 మంది వలంటీర్ల సహకారంతో సచివాలయాలలో దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నెల పింఛన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శ్రీకృష్ణాపురంలో లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పింఛన్ డబ్బులు రూ.3 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఓటేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, భాస్కర్, వెంకటరెడ్డి, బాబూరావు, నందిక బేబీ పాల్గొన్నారు.

ప్రజా సేవే సీఎం జగన్ లక్ష్యం

ఎంవీపీ కాలనీ: సామాజిక పింఛన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి అవ్వాతాతలు 18వ వార్డులోని అప్పుఘర్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3 వేలుకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా వెలుగులు పంచుతున్నారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ఇంతగా ప్రజలకు సేవ చేసిన ముఖ్యమంత్రి లేరన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీలోని 17వ వార్డులో వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3 వేలుకు పెంచిన సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి అవ్వా తాతలు క్షీరాభిషేకం నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలారెడ్డి, లక్ష్మణరెడ్డి, కుమార్, ప్రేమ్ కిరణ్, లవనకుమార్, సత్యవతి, నాగరాజు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో గడపగడపకు పాదయాత్ర



సూర్యతేజనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కోరారు. జీవీఎంసీ 12వ వార్డులో గడపగడపకు పాదయాత్ర సోమవారం ఉత్సాహంగా జరిగింది. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంపీ ఎంవీవీ సూర్యతేజనగర్, బీటీఆర్ నగర్, బీసీ కాలనీ, గణబాబునగర్, తోటగరువు, న్యూశాంతినగర్‌లలో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఏవిధంగా లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. అర్హులైనవారు ఇంకెవరైనా ఉంటే పథకాల కోసం సచివాలయాలలో సంప్రదించాలని సూచించారు. ఆయా కాలనీలలో సమస్యల గురించి స్థానికులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలకు రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కెర శేఖర్, హుస్సేన్, సూర్యారావు, మోహన్, సత్యనారాయణ, సుజాత, రాజులమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘త్వరలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో సమస్యల పరిష్కారం’



సమస్యల గురించి విద్యార్థులను అడుగుతున్న సోషల్ వెల్ఫేర్ అధికారులు

ఆరిలోవ: రూరల్ మండల కార్యాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమాదేవి తెలిపారు. ఇక్కడ హాస్టల్‌లో భోజనం, మరుగుదొడ్లు, వసతి, తదితర సమస్యలపై ఆదివారం రాత్రి విద్యార్థులు ధర్నా చేయడం తెలిసిందే. దీంతో ఆమె సోమవారం హాస్టల్‌ను సందర్శించారు. ఆరిలోవ ఎస్ఐ సూర్యనారాయణ, హాస్టల్ వార్డెన్ రమేష్‌తో కలసి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. హాస్టల్‌లో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. శిథిలమైన భవనం, వాటర్ సరఫరా లేకపోవడం, రుచికరమైన భోజనం పెట్టకపోవడం తదితర సమస్యలను విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల నీటి సరఫరా లేక బయట నుంచి నీటి తీసుకొస్తున్నామని, దానికి కొంత ఖర్చు అవుతుందని వార్డెన్ చెప్పారని, ఆ నీటి సరఫరా కోసం మెనూ ప్రకారం పెట్టాల్సిన చికెన్ కూరను 40 రోజుల పాటు ఆపేశారని ఆమెకు వివరించారు. దీంతో రమాదేవి వార్డెన్‌ను మందలించారు. ఇప్పటికే హాస్టల్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, కొద్ది రోజుల్లో పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

హనుమంతవాకలో మందుబాబుల వీరంగం



హనుమంతవాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట ఘర్షణ పడుతున్న మందుబాబులు

ఆరిలోవ: హనుమంతవాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట మందుబాబులు సోమవారం సాయంత్రం వీరంగం వేశారు. పూటుగా మద్యం తాగిన మైకంలో ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. దీంతో బస్సులు, ఆటోల కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఆందోళన చెందారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఎదురుగా మద్యం దుకాణం ఉంది. ఈ దుకాణంలో మద్యం సేవించిన కొందరు గ్రూపులుగా విడిపోయి కొట్లాటకు దిగారు. సాయంత్రం కావడంతో నగరం నుంచి ఆరిలోవ వైపు వెళ్లే వాహనాలు, ఆరిలోవ వెళ్లే బస్సుల కోసం అక్కడ ఎదురు చూసే మహిళలు, కళాశాలల విద్యార్థులు ఆ కొట్లాటకు బెంబేలెత్తిపోయారు. వారంతా భయంతో రోడ్డు పక్కకు పరుగులు తీశారు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఈ గొడవ మాకెందుకులే అనుకున్నారో ఏమోగాని ఒక్కరూ సమయానికి స్పందించలేదు. దీంతో కొందరు ప్రయాణికులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి గొడవ విషయాన్ని చెప్పడంతో అప్పుడు కానిస్టేబుళ్లు వచ్చి మందుబాబులను చెదరగొట్టారు. దీంతో గొడవకు బ్రేక్ పడింది. గొడవ మరింత పెద్దది కాకుండా ఆగినందుకు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

రీడింగ్ రూమ్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీడింగ్ రూమ్‌ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సోమవారం సందర్శించారు. రీడింగ్ రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని విద్యార్థులకు రిజిస్ట్రార్ సూచించారు.

నర్సుల పదోన్నతుల జాబితాపై ఫిర్యాదు



ఆర్డీకి ఫిర్యాదు చేస్తున్న స్టాఫ్ నర్సులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో నర్సుల పదోన్నతుల సీనియార్టీ జాబితాల్లో అవకతవకలు జరిగాయని పలువురు నర్సులు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సుజాతకు ఫిర్యాదు చేశారు. ఈ సీనియార్టీ జాబితాను సవరించిన తర్వాత పదోన్నతులు ఇవ్వాలని నర్సులు కోరారు. సీనియార్టీ జాబితాలో రోస్టర్ పాయింట్ అమలు చేయాలని కోరారు. కొంత మంది సిబ్బంది సీనియార్టీ జాబితాలో అక్రమాలకు పాల్పడినట్టు పేర్కొన్నారు. ఆర్డీని కలిసిన వారిలో కేజీహెచ్ స్టాఫ్ నర్సులు టి.గంగాభవానీ, జీవీఎస్ వరలక్ష్మి, పద్మజ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆంధ్ర మహాభారతం పద్యాలాపన



విద్యార్థులతో పద్యాలు ఆలపిస్తున్న సంగీతం టీచర్లు



పద్యాలు ఆలపిస్తున్న పాఠశాలల విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆంధ్ర మహా భారతంలోని 108 పద్యాల ఆలాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి 30వ ఆరాధనా మహోత్సవం పేరిట శ్రీకంచి కామకోటి శంకర మఠం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు బ్యాచ్‌లుగా గత 3 నెలలుగా పద్యాలాపనపై పెద్ద ఎత్తున శిక్షణ ఇచ్చారు. అనంతరం సోమవారం 108 పద్యాలను విద్యార్థులు టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఆలపించి అలరించారు. 15 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాస్

ఆరిలోవ : జీవీఎంసీ 11వ వార్డు అప్సరా కాలనీలో సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా పాత కార్యవర్గానికి వీడ్కోలు పలుకుతూ కొత్త కార్యవర్గ సభ్యులు సంక్రాంతి సందర్భంగా మహిళలకు సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళలకు ముఖ్యఅతిథి వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. అనంతరం కాలనీ సంఘం పాత కార్యవర్గం సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నూతన కార్యవర్గం అధ్యక్షుడు బోద లక్ష్మణరావు, సభ్యులు ఇ.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాస్, వి.రామకృష్ణ, ఎన్.రవితేజ, పి.రమేష్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో శ్రీవారు



పుష్పాల అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామి కనకాంబరాలు, వివిధ పరిమళ పుష్పాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోష్ఠిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 24వ పాశురాన్ని స్వామివారికి విన్నపం చేశారు. భక్తులు అందరి చేత అర్చకులు కర్పూర హారతిని సమర్పింపజేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదం అందజేశారు.

10న గ్రాండ్ ఫెస్ట్ 2కే24



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపల్ కాసు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో ద గ్రాండ్ ఫెస్ట్-2కే24 బుధవారం నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి కళాశాల ఆవరణలో విద్యా, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొంటారని చెప్పారు. 12 స్టాళ్లలో పలు ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ఈ ఫెస్ట్‌ను ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్ఐవో సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆయా కార్యక్రమాలతో పాటు సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు, కుక్కింగ్ పోటీలు జరుగుతాయన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



పాతవెంకోజీపాలెంలో ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



బీచ్‌రోడ్డులోని ఎంఎల్‌బీటీ పాఠశాలలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంబరాలలో భాగంగా హరిదాసు మేలుకొలుపుతో పాటు రంగు రంగుల ముగ్గులతో చెరకు గెడలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి పాటలు, భోగి మంటలు, గొబ్బెమ్మ పాటలతో చిన్నారులు సందడి చేశారు. గాలి పటాలను ఎగురవేస్తూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిహెచ్.జ్యోతి, ఉపాధ్యాయులు రమాదేవి, శ్రీలక్ష్మి, అరుణ, రాము, జగన్ పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: చిన్నారులు భారతీయ సంప్రదాయానికి వారసులుగా నిలుస్తారని ఆచార్య డి.సరిత అన్నారు. సోమవారం బీచ్‌రోడ్డులోని ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఆమె ప్రారంభించారు. సంస్కృతి, సంప్రదాయాలను బాల్యం నుంచే అలవాటు చేయాలని సూచించారు. తెలుగు దనాన్ని ప్రతిబింబిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



సింహాసనంపై వెంకన్న

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు విశేషంగా జరిగాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆరాధన నిర్వహించిన అనంతరం పాశుర విన్నపం నిర్వహించారు. వెంకన్న ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. గోదాదేవిని అలంకరించారు. భక్తులు స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

స్మార్ట్‌సిటీ నిధులతోరహదారుల నిర్మాణం



రహదారుల నిర్మాణం పరిశీలిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

ఏయూ క్యాంపస్: స్మార్ట్ సిటీ నిధులతో చినవాల్తేరులో నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. అత్యంత నాణ్యతో పనులు కొనసాగుతున్నాయి. సోమవారం రహదారి నిర్మాణాన్ని కార్పొరేటర్ మువ్వల లక్ష్మి స్వయంగా పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తిచేయాలని సూచించారు.

వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలు చోరీ

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా గల బొర్రా సీతారత్నం ఇంట్లోకి సోమవారం ఉదయం గుర్తు తెలియని మహిళ చొరబడి ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు కాజేసింది. భీమిలి క్రైమ్ సీఐ కె.సురేష్, ఎస్ఐ సూర్యప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం 5.30 ప్రాంతంలో ఇంటి ముందు పువ్వులు ఏరడానికి సీతారత్నం బయటకు వచ్చి అరగంట వ్యవధిలో మళ్లీ ఇంట్లోకి చేరుకుంది. ఆ సమయంలో గుర్తు తెలియని 50 ఏళ్ల మహిళ ముఖానికి గుడ్డ కట్టుకుని టీవీ, లైట్లు ఆపేసి ఇంట్లో నక్కింది. సీతారత్నం ఇంట్లోకి చేరగానే ఆభరణాలు తెంపడానికి ఆ మహిళ ప్రయత్నించింది. ఈ సందర్భంగా సీతారత్నం ప్రతిఘటించగా నాలుగు లైన్ల బంగారు చైన్‌లో కొంతభాగం మిగలగా... నిందితురాలు 2 తులాల బంగారు పుస్తెలతాడు, 2.5 తులాల నాలుగు పేటల చైన్ కాజేసింది. దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా... సోమవారం ఉదయం 6 గంటల సమయంలో సంతపేట అంకిత రెడీమేడ్స్ వైపు వచ్చిన నిందితురాలిని గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.